నత్తనడకన సార్వా సాగు

- నారుమడుల దశలోనే ఖరీఫ్ సాగుకు ఆటంకాలు
- భారీ వర్షాలతో మునుగుతున్న నారుమడులు, నాట్లు
- నియోజకవర్గంలో 30,578 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు


కుప్పనపూడిలో నీట మునిగిన నారుమడి

ఆకివీడు: ఆకివీడు నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాగు నత్తనడకన సాగుతోంది. ఆదిలోనే హంస పాదులా భారీ వర్షాలు కురుస్తుండటంతో నారు మడుల దశలో, కొన్ని చోట్ల నాట్ల దశలో చేలు ముంపు బారిన పడుతున్నాయి. ఇటీవల కొంతవరకు వర్షాలు తగ్గినా నారుమడులు, నాట్లు ఉన్న చేలల్లో ముంపు నీరు తొలగడం లేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆరంభంలోనే ఆటంకాల్ని ఎదుర్కొంటోంది. జూన్ ఒకటో తేదీనే పంట కాల్వలకు నీరు వదిలినప్పటికీ, ఆయా కాలువలకు అంతంత మాత్రంగానే చేరింది. దీంతో నారుమడులు వేసుకునేందుకు సరిపడా నీరు అందుబాటులో లేదు. దమ్ము పనులకు నీరు అందక వరుణదేవుడి కోసం ఎదురుచూశారు. అయితే జూన్ నెలాఖరు, జూలైలో కురిసిన వర్షాలతో రైతులు ఊపిరి పీల్చుకుని ఖరీఫ్ సాగుకు సన్నాహాలు చేశారు. ఇదే తరుణంలో పంట కాలువలోకి ఫ్యాక్టరీ వ్యర్థాల నీరు వదిలివేయడంతో వెంకయ్య వయ్యేరు కాలువ నీరు కలుషితమై వారం, పది రోజుల వరకూ నీటిని ఉపయోగించే అవకాశం లేకుండా పోయింది. నియోజకవర్గంలో 30,578 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టేందుకు రైతులు నారుమడులు వేసుకుంటున్నారు.

మండలంలో ఎంటీయూ 1318దే హవా

ఆకివీడు మండలంలో ఎంటీయూ 1318 రకం వంగడాన్నే రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ప్రైవేటు రకం సంపద వంగడం, ఎంటీయూ 1064, 61 వంగడాలతో పాటు పూళ్ల (పీఎల్) రకం 1100 వంగడాల్ని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ నాట్లు ఆగస్టు మొదటి వారానికి పూర్తయ్యే అవకాశం ఉంటుందంటున్నారు. మాసూళ్లు డిసెంబర్ 15 నుంచి జనవరి నెల వరకూ కొనసాగవచ్చునని చెబుతున్నారు. అయితే సెప్టెంబర్, నవంబర్ నెలల్లో తుపాను ప్రభావానికి గురికాకుండా ఉండేందుకు డిసెంబర్‌లో మాసూళ్లు పూర్తి చేసేందుకు రైతులు సకాలంలో నాట్లు వేయాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పచ్చిరొట్టతో పోషకాలు

పచ్చిరొట్ట సాగుతో భూమిలో పోషక విలువలు అధికంగా ఉంటాయని ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు చెబుతున్నారు. పచ్చిరొట్టను దుక్కి సమయంలో భూమిలో కలియదున్నడం వల్ల భూసారం మెరుగుపడి అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని, చీడపీడలకు అవకాశం ఉండదని ఆయన చెప్పారు. తన పొలంలో జీలుగ పచ్చిరొట్ట విత్తనాల్ని వ్యవసాయాధికారి ప్రియాంక అందజేశారని చెప్పారు. 20 రోజుల్లోనే పచ్చిరొట్ట చేల్లో విపరీతంగా పెరిగిందన్నారు. ఖరీఫ్ సాగు ఆలస్యం కాకుండా వెంటనే దమ్ము పనులు మొదలు పెట్టినట్లు ఆయన వివరించారు.

ఉండి నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు వివరాలు

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
ఆకివీడు	4,300
కాళ్ల	4,100
ఉండి	10,978
పాలకోడేరు	11,200
మొత్తం	30,578

భారీ వర్షాలకు నీట మునిగిన నారుమడులు

భారీ వర్షాలకు పలు గ్రామాల్లో నారుమడులు నీట మునిగాయి. ఉండి మండలంలోని యండగండి, ఉప్పులూరు, ఆకివీడు మండలంలోని మాదివాడ, చెరుకుమిల్లి, మందపాడు, పాలకోడేరులోని శృంగవృక్షం, వేండ్ర గ్రామాల్లో నారుమడులను డ్రెయిన్ల నీరు ముంచెత్తింది. చేలల్లో వర్షం నీటిని ఎప్పటికప్పుడు రైతులు బయటకు తోడుకునే ప్రయత్నాలు చేశారు. కొన్ని చోట్ల నారుమడులు కొంత మేర దెబ్బతిన్నాయి. ఆయా మండలాల్లోని ప్రధాన మురుగు కాల్వలు పొంగి ప్రవహించడంతో నారుమడులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

భీమవరం: ప్రేమించి పెళ్లిచేసుకున్న భర్త వ్యసనాలకు బానిసై వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన వలవల నందిని అదే ప్రాంతానికి చెందిన వలవల సాయిదుర్గ మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్నాళ్లు కాపురం సజావుగా సాగిన తరువాత మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసైన సాయిదుర్గ నిత్యం భార్య నందినిని వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: పట్టణంలోని నెహ్రూనగర్‌కాలనీకి చెందిన 14 ఏళ్ల బాలుడు అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఏఎస్సై కె.శ్రీనివాస్ ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలుడు పేరం సత్యప్రకాష్ తన తాత పెన్ని ఏసుబాబు వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. అయితే ఏసుబాబు వద్ద కొంతనగదు మాయం కావడంతో సత్యప్రకాష్‌ను మందలించాడు. దీంతో ఆదివారం తెల్లవారుజామున తన పుస్తకాల బ్యాగ్‌తో అదృశ్యమైనట్లు ఏసుబాబు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్యులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కాళ్ల: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏలూరుపాడు గ్రామ సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు అన్నారు. ఏలూరుపాడు లయన్స్ క్లబ్ సభ్యులు, వాసవి క్లబ్, భీమవరం ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరుపాడులో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఆపరేషన్‌లు అతి తక్కువ ఖర్చుకు చేయనున్నారు. రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవి వర్మ, డాక్టర్ పి.కృష్ణచైతన్య, ఏలూరుపాడు లయన్స్ క్లబ్ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత


పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని మెంటేవారితోటలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆదివారం 25 మంది గర్భిణులకు చీరలు, పౌష్టికాహారం, 250 మంది ముంపు బాధితులకు ఆహార పొట్లాలను అందించారు. మాజీ కౌన్సిలర్ ఎద్దు ఏసుపాదం మాట్లాడుతూ గత 10 రోజులుగా ఈ ప్రాంతాల్లో ముంపునకు గురైన బాధితులకు అనేక మంది దాతలు వివిధ రకాలుగా సహకరిస్తున్నారని, భోజనాలు, దుప్పట్లు, పిల్లలకు పుస్తకాలు విద్యా సామగ్రి అందిస్తున్నారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్యాటరింగ్ వాసు, చంద్రిక మూర్తి ఆర్థిక సహకారంతో 250 మందికి భోజనాలు అందించామని, మా తల్లి మహాలక్ష్మమ్మ పేరిట 25 మంది గర్భిణులకు చీరలు, పౌష్టికాహారం అందించామని తెలిపారు. కొండ్రు శ్రీనివాస్, బెన్ని తదితరులు పాల్గొన్నారు

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ


మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన వెన్నెంశెట్టి లక్ష్మణరావు, లక్ష్మి దంపతులు 24 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్, ఈఓ బుద్ధ మహాలక్ష్మి నగేష్, సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'మానవత' సేవలు విస్తరిద్దాం


పెదపుల్లేరు సమావేశంలో పాల్గొన్న మానవత ప్రతినిధులు

ఉండి: మానవతా సేవాసంస్థ ద్వారా సమాజంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంస్థ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెన్మత్స రామకృష్ణంరాజు, గాదిరాజు రంగరాజు అన్నారు. ఆదివారం పెదపుల్లేరులో మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మానవతా స్వచ్ఛందసంస్థ ద్వారా మండలంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల విస్తరణకు ప్రణాళికలు రూపొందించామన్నారు.

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ వార్షికోత్సవం


కళాకారులకు సత్కారాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగ స్థల కళాకారుల సంక్షేమ సంఘం 44వ వార్షికోత్సవం స్థానిక భ్రమరాంబిక మల్లికార్జున విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికారాణి ఉడయార్, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, ఉపాధ్యక్షులు మాసా బాబూరావు, కొల్లి రమావతి, కర్రి ప్రభాకర్ బాలాజీ, ఏలూరి జగదీష్, కోశాధికారి తగరంపూడి యడవల్లి శశికుమార్ పర్యవేక్షించారు. డాక్టర్ నార్ని భావాజీలు హాజరై మాట్లాడారు.

అంధకారంలో వేండ్ర

- 20 రోజులుగా వెలగని వీధి దీపాలు
- చీకట్లో రాకపోకలు సాగించలేక బెంబేలు


వేండ్రలో వీధిలైట్లు వెలగని దృశ్యం

పాలకోడేరు: మండలంలోని వేండ్ర గ్రామంలో గత 20 రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో రాత్రి వేళల్లో గ్రామంలో రాకపోకలు సాగించాలంటే గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం కావడంతో పాములు యథేచ్ఛగా సంచరిస్తున్నాయని, ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో పల్లపు ప్రాంతాలన్నీ ముంపు బారిన పడ్డాయని, రాత్రి వేళల్లో ఈ ముంపునీటిలో వెళ్లేది ఎలా అంటూ వాపోతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో చీకట్లోనే సంచరిస్తున్నామని, అయినా పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన లేదని మండిపడుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి దొంగ సత్యనారాయణను వివరణ కోరగా వీధిలైట్లు సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

వాసవీ అమ్మవారికి సారె సమర్పణ

భీమవరం: వాసవీ క్లబ్ చేస్తున్న సేవలతో పాటు సమాజ సేవలో ఆదర్శంగా ఉండాలని క్లబ్ జిల్లా గవర్నర్ వీఎల్ఎన్‌వీ ప్రసాద్ అన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు, మిఠాయిలు, సుమారు 54 రకాలతో ఆషాఢమాస సారె సమర్పించారు. బీవీరాజు పార్కు నుంచి క్లబ్ సభ్యులతో కలిసి సారెతో ఊరేగింపుగా త్యాగరాజ భవనంలో వాసవీ ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించి పూజలు నిర్వహించారు. మునిసిపల్, రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద సిమెంట్ బెంచీలు, గోశాలలో దాణా, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముగింపులో భాగంగా కమిటీ సభ్యులు సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఆత్మీయ అతిథులుగా సీహెచ్ఎస్ఎస్ఎస్. ప్రసాద్, చక్కా శ్రీనివాసరావు, పాబోలు నరసింహమూర్తి, గూడూరి బాలమురళీ, అత్యం వాసు, అయితే వెంకటకృష్ణారావు పాల్గొన్నారు. కార్యక్రమ కమిటీ చైర్మన్ అనంతపల్లి చలపతిరావు, కో–చైర్మన్లు ఎస్.మోహనరావు, ఎన్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ముగిసిన టీచ్ టూల్ ట్రైనింగ్


ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు

పాలకొల్లు సెంట్రల్: టీచ్ టూల్ ట్రైనింగ్‌లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తమ పరిధిలో ఉన్న పాఠశాలలకు వెళ్లి తరగతి గదుల్లో అభ్యసనం ఎలా జరుగుతుందో? పరిశీలించాలని మండల విద్యాశాఖాధికారి–1 గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. స్థానిక బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో గత తొమ్మిది రోజులుగా నిర్వహించిన టీచ్ టూల్ ట్రైనింగ్ శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ శిక్షణలో పాల్గొన్న 110 మంది ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో పరిశీలన చేసిన తరువాత ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో టెస్టులు నిర్వహించి పాసైన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 ఆర్ఎస్ఎస్‌విజి శర్మ, పోడూరు ఎంఈఓ విజయకుమార్, యలమంచిలి ఎంఈఓ కృష్ణంరాజు, ఆర్పీలు నరేష్, లక్ష్మీనారాయణ, నరసింహరాజు, మూర్తి పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ లక్ష్మీబాయి, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసిన ఎక్లీషియా చర్చి నిర్వాహకుడు ప్రభుదేవ

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద గ్రామంలోని ఎక్లీషియా చర్చి 15వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి అధినేత పాస్టర్ చింతా ప్రభుదేవ మాట్లాడుతూ బైబిల్‌లోని వాక్యాలు ప్రతి ఒక్కరూ ఆచరించదగినవని పేర్కొన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో కలిసిమెలిసి జీవించాలని కోరారు. తొలుత చర్చిలో వార్షికోత్సవ కేక్‌ను కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు వెళ్లే 30 మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డొక్కుమళ్ల హన్నీ, వర్ధనపు సుధాకర్, వర్ధనపు రాధాఅశోక్, పాలపర్తి పెద్దిరాజు, చింతా లాజరు, గాది కుమార్ తదితరులు పాల్గొన్నారు. .

ధ్యానం ద్వారా వ్యాధులు దూరం


పిరమిడ్ మాస్టర్ రత్నమాలను సత్కరిస్తున్న పిరమిడ్ సభ్యులు

పెనుమంట్ర: ధ్యానం చేయడం ద్వారా ఆలోచన రహిత స్థితిని పొందడం వల్ల అనారోగ్యాల దూరంగా ఉండవచ్చని సీనియర్ పిరమిడ్‌మాస్టర్ ఎం రత్నమాల అన్నారు. ఆదివారం పెనుమంట్రలోని ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు నివాసంలోని పిరమిడ్ కేంద్రంలో జరిగిన ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానం వల్ల జ్ఞానం, ముక్తి లభిస్తాయని, ధ్యానం ద్వారా అనేక అనుభవాలను పొందగలిగానని శిక్షణ శిబిరంలో సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా రెండు గంటలకు పైగా సభ్యులతో ధ్యానం చేయడంలో మెళకువలను నేర్పారు. అనంతరం ఆమెను సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మందికి పైగా ధ్యాన సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: కాళ్లలోని ఎస్‌సీ బోసు కాలనీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నిమిత్తం ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ ఆదివారం చెప్పారు. ఉపకేంద్రం పరిధిలోని ఇసుక లంక, మాలవానితిప్ప, గోగుతిప్ప, ఆనందపురం, దొంగపిండి, గూట్లపాడు గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

నరసాపురం: పట్టణంలోని శ్రీ పాండురంగస్వామి కల్యాణ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు

సబ్ జైలు తనిఖీ

నరసాపురం: నరసాపురం సబ్ జైలును ఆదివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.వరలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు అదాలత్ నిర్వహించి, ఖైదీలకు అందించే ఆహారం నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. ఖైదీలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేనివారు కోర్టు జైలు విజిటింగ్ లాయర్‌ను సంప్రదిస్తే ఉచిత న్యాయవాదిని నియమిస్తారని చెప్పారు. జడ్జి వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు ఉన్నారు.

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సుగుణరావు మృతి

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు, లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన డాక్టర్ గోగులమండ సుగుణరావు (68) ఆదివారం మృతి చెందారు. గత కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, పీడీ రాజు, ఉంగరాల రమేష్‌నాయుడు, సంగాని బాబూరావు, సీతారామపురం సర్పంచ్ దొండపాటి వెంకట్, పులపర్తి ప్రతాప్ తదితరులు సుగుణరావు మృతిపై సంతాపం తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నా అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు, పాలకవర్గ చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆన్‌లైన్‌లో 'మన్ కీ బాత్'

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ శక్తి కేంద్రంలో కేంద్ర అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం 112 మన్ కీ బాత్ ఆన్‌లైన్‌లో వీక్షించే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నరిశే సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని దేశం కోసం చేస్తున్న సేవలను కొనియాడారు. సభ్యులు పుల్లా శ్రీనివాస్, పుల్లా సాయిరాం, జంగం నరేష్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమస్యలు పరిష్కరించాలి


డీవైఈఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

భీమవరం అర్బన్: విద్యా వ్యవస్థలో అపరిష్కృతంగా ఎన్నో సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు కోరారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం డీవైఈఓ ఎస్.శ్రీనివాసరావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణల వల్ల అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వాసం సడలిపోతోందని, పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. పరిస్థితులు విషమించకముందే ప్రభుత్వం మేల్కొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయింపు నిచ్చి పనిభారం తగ్గించాలన్నారు. హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ప్రమోషన్లు, బదిలీలు వెంటనే నిర్వహించాలని కోరారు. జిల్లా కోశాధికారి సీహెచ్ పట్టాభిరామయ్య, సభ్యులు కేఎస్‌సీహెచ్ సాయిరామ్, సీహెచ్ కుమార బాబ్జి, జి.రామకృష్ణంరాజు, కె.రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ఐఐటీ సీటు సాధించిన విద్యార్థులకు సత్కారం


గుమ్ములూరులో ఐఐటీ సీట్లు పొందిన అభిషేక్, అఖిల్‌లను అభినందిస్తున్న జేబీఎస్ఎస్ సభ్యులు

పోడూరు: ఐఐటీ సీటు సాధించిన కవల సోదరులైన ఇద్దరు విద్యార్థులకు జై భీమ్ సేవాసమితి(జేబీఎస్ఎస్) ఆర్థిక ప్రోత్సాహం అందించింది. గుమ్ములూరు గ్రామానికి చెందిన కవల సోదరులు పైడి అభిషేక్, పైడి అఖిల్ ఐఐటీలో వరుసగా 2633, 1906 ర్యాంకులు సాధించి సీట్లు పొందారు. జేబీఎస్ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మైలాబత్తుల రాజశేఖర్, చింతా సంపత్, సభ్యులు ఆదివారం వారి నివాసానికి వెళ్లి అభినందించారు. ఇరువురికీ జేబీఎస్ఎస్ సంస్థ తరఫున రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జేబీఎస్ఎస్ గౌరవాధ్యక్షుడు మదన్‌మోహన్, అడ్వైజర్ మానుకొండ సత్యనారాయణ, కోశాధికారి జి.జనార్దనరావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేణుబాబుకు మానవత సభ్యుల పరామర్శ

పెనుమంట్ర: మార్టేరు గ్రామ ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, జడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి దంపతులను ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన సభ్యులు పరామర్శించారు. వేణుబాబు మాతృమూర్తి ఆదిలక్ష్మి ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పెనుమంట్ర మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు వేణుబాబు నివాసానికి వెళ్లి ముందుగా ఆదిలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస మురళీకృష్ణ, చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం, కో–చైర్మన్ పడాల జగన్నాథరెడ్డి, రీజినల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.